నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 1 మే 2025 | SIDDIPET

నంగునూరు మండలం పాలమాకుల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో చినిగిపోయిన గన్నీ బ్యాగులు

మిట్టపల్లి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ఇంటి దగ్గర చినిగిపోయిన కవర్లు తీసుకొచ్చి కప్పుతున్న మహిళా రైతులు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- ధాన్యం తెచ్చిన పదిహేను రోజులకు కాంటా
- పది రోజులు దాటినా ధాన్యం డబ్బులు పడతలేవు
- క్వింటాల్‌కు మూడు కిలోల వరకు తరుగు
- కేంద్రాల్లో చినిగిపోయిన గన్నీబ్యాగులే బిక్కు
- టార్పాలిన్ కవర్లు లేవు... ప్యాడీక్లీనర్లు అంతంతే
- అద్దెకు ప్యాడీక్లీనర్లు తెచ్చుకుంటున్న రైతులు
- ట్రాక్టర్ వడ్లు తూర్పార పడితే రూ.500 వరకు రైతుపై భారం
- దళారులు, కేంద్రాల నిర్వాహకుల కుమ్మక్కు
- ఫోన్లు లిఫ్ట్ చేయని సివిల్ సప్లై అధికారులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో రోడ్డెక్కుతున్న అన్నదాతలు

కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు

సిద్దిపేట జిల్లాలో ధాన్యం కాంట కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు

సిద్దిపేట, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో నత్తనడకన ధాన్యం సేకరణ జరుగుతున్నది. కొన్ని ప్రాంతాల్లో దొడ్డు వడ్లకు మిల్లుల అలాట్‌మెంట్ ఇంకా కాలేదు. మిల్లులు అలాట్‌మెంట్ కాలేదని చాలాచోట్ల సన్న వడ్ల కాంటా కావడం లేదు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో యాసంగి ధాన్యం సేకరణలో ఆలస్యం జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం సిద్దిపేట జిల్లాలో 419, మెదక్ జిల్లాలో 480, సంగారెడ్డి జిల్లాలో 238 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో కనీసం 20శాతం వడ్లు రైతుల నుంచి కొనుగోలు చేయలేదు. కేంద్రాలకు ధాన్యం తెచ్చి వారం పదిరోజులు అవుతున్నా కాంటా చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించడం లేదని, ఫోన్లు చేస్తే లిఫ్ట్ చేయడం లేదని, దురుసుగా సమాధానం ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.ఒక్కో రైతు పదిహేను రోజులు కొనుగోలు కేంద్రం వద్దనే పడిగాపు కాస్తున్నాడు. ధాన్యం కాంటా అయి పది రోజులైనా రైతులకు డబ్బులు పడడం లేదు. ఏ సెంటర్‌లో చూసి నా పాత గన్నీ బ్యాగులు, చినిగిపోయిన గన్నీ బ్యాగులు కనిపిస్తున్నాయి. వాటిలో వడ్లు నింపగానే ఖాళీ అవుతున్నాయి.

చినిగిపోయిన గన్నీ బ్యాగులతో అవస్థలు

చినిగిపోయిన గన్నీ బ్యాగులు ప్రభుత్వం పంపడంతో రైతుల వాటిని రైతులు కుట్లు వేసి ధాన్యం నింపుతున్నారు. ఒక్కో సంచి నుంచి ధాన్యం పోవడంతో తరుగు పేరిట కోతలు విధిస్తున్నారు. కేంద్రాల్లో సరిపడా ప్యాడీ క్లీనర్లు లేవు. దీంతో రైతులు అద్దెకు తూర్పార పట్టే యంత్రాలను తీసుకువచ్చి వడ్లు తూర్పార పడుతున్నారు. ఒక్క ట్రాక్టర్ తూర్పార పడితే రూ.400 నుంచి రూ.500 వరకు రైతుపై భారం పడుతున్నది. తూర్పార పట్టి మిషన్ సంచులు నింపే దానికి ఒక ట్రాక్టర్ ట్రిప్ వడ్లకు రూ. 800 తీసుకుంటున్నారు ప్రభుత్వ ప్యాడీ క్లీనర్లు పనిచేయక పోవడంతో రైతులకు అదనపు భారం పడుతున్నది. టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అన్ని సెంటర్లకు కవర్లు అందించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం టార్పాలిన్ కవర్లు అందివ్వక పోవడంతో అకాల వర్షాలకు వడ్లు తడిసి ముద్దవుతున్నాయి. వర్షానికి తడిసిన ధాన్యం ప్రభు త్వం కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలో రైతులకు అన్నీ సమస్యలే ఉన్నాయి. కేంద్రాల నిర్వహణ చూసే వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల నంగునూ రు మార్కెట్ యార్డులో వడ్లు తీసుకపోయిన రైతుల మీదికి అక్కడి క్షేత్రస్థాయి అధికారి దురుసుగా మాట్లాడారని రైతులు ఫిర్యాదు చేశారు. చాలా కేంద్రాల్లో రైతులకు టోకెన్ ఇవ్వడంలోనూ రాజకీయాలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వరుస పద్ధతి కాకుండా ఇష్టానుసారంగా టోకెన్లు విడుదల చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అసలే ఈ యాసంగిలో వరి పంట సరిగ్గా దిగుబడి రాక రైతులు దిగులుతో ఉన్నారు. పంట దూసపోయి రోగం వచ్చి దిగుబడిపై ప్రభావం చూపింది. ఎక్కువగా తాలు పోతున్నదని రైతులు చెబుతున్నారు. మిట్టపల్లికి చెందిన రైతు రెండెకరాల్లో నాటువేస్తే కేవలం రెండు ట్రాక్టర్ల వడ్లు మాత్రమే వచ్చాయి. పంటంతా దూసపోయి దిగుబడి రాలేదు, ధాన్యం కొనుగోలు తీసుకువస్తే సెంటర్‌లో పది రోజులుగా పడిగాపులు కాయాల్సి వస్తున్నదని రైతు వాపోయాడు.

రైతులకు అన్నీ ఇబ్బందులే..

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులే ఎదురవుతున్నాయి. ఎండలు విపరీతంగా ఉండడంతో కనీసం నీడను ఏర్పాటు చేయడం లేదు. తాగునీటి వసతి లేదు. చిరిగిన గన్నీ బ్యాగులు ఉన్నాయి. తూర్పార పట్టే యంత్రాలు సరిపడా లేక ఆలస్యం అవుతున్నది. సీరియల్ నెంబర్ వచ్చే వరకు మూడు రోజులు, కాంటా అయి ధాన్యం లారీలో లోడ్ అయ్యే వరకు మరో ఐదు రోజులవుతున్నది. మొత్తంగా కేంద్రం వద్ద రైతులు 10 నుంచి 15 రోజులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. ధాన్యం అమ్ముకున్న రైతుకు పది రోజులు దాటినా పైసలు రావడం లేదు. బీఆర్ఎస్ హయాంలో 72 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని రైతులు తెలుపుతున్నారు. దళారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కై రైతులకు నష్టం చేకూరుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అకాల వర్షాలు, సర్కారు కేంద్రాలు ఓపెన్ కాక పోవడంతో ఇప్పటికే చాలామంది రైతులు తక్కువ ధరకు వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్నారు. తాము కొన్న ధాన్యాన్ని వ్యాపారులు ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరున విక్రయించి మద్దతు ధర పొందుతున్నట్లు తెలిసింది. దీనికి కేంద్రాల నిర్వాహకులతో దళారులు ఒప్పందం చేసుకుని దందా సాగిస్తున్నట్లు తెలిసింది. దళారులు తెచ్చిన ధాన్యం గుట్టుచప్పుడు కాకుండా కాంటా చేయించి లారీల్లో లోడ్ చేయించి నిర్వాహకులు పంపుతున్నారు. ఒక్కో క్వింటాల్‌కు రూ. 400 నుంచి రూ. 500 వరకు లాభం పొందుతున్నారు.ఇలా వచ్చిన డబ్బులో నిర్వాహకులకు కొంత మేర దళారులు అప్పజెప్పుతున్నారు. యాసంగిలో వరి పంట సరిగా రాలేదని రైతులు చెబుతున్నారు. పంట దూస (ఊస)పోయి చాలావరకు తరుగు పోతున్నది. వరి పొట్ట దశలోనే ఈ మాయ రోగం అందుకుంది. ఎప్పుడు కూడా ఇలా రాలేదని రైతులు చెబుతున్నారు. రెండు ఎకరాల పంట వేస్తే రెండు ట్రాక్టర్ల వడ్ల దిగుబడి కూడా రాలేదని వాపోతున్నారు. ఆయా కేంద్రాల వద్ద తాలు కుప్పలు, కుప్పలుగా పడి ఉంది. దీంతో రైతులు నష్టపోయారు.

వారం దాటినా డబ్బులు పడలేదు...

నాకున్న రెండెకరాల పాటు మరో రెండు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వరిసాగు చేశాను. నీళ్ల గోసతో అంతంతా మాత్రం పొలం పారింది. ఎండేకాడికి ఎండి పోయింది. మిగతా వరి కోసం వడ్లను కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. వడ్లు ఎండబెట్టి, తూర్పార పట్టి, సంచుల కోసం తిరుగుడు, అటు ఇటు అనేసరికి వారం రోజుల సమయం పట్టింది. తీరా వడ్లు అమ్మినా వారం దాటినా డబ్బులు ఖాతాలో జమకాలేదు. అడిగితే రేపు, మాపు పడుతాయ్ అంటున్నారు. గతంలో వడ్లు అమ్మిన వెంటనే ఒకటి, రెండు రోజుల్లో ఖాతాలో పైసలు పడ్డాయ్.

-భూక్య జగన్, రైతు, బోదర్‌వాగు తండా(అక్కన్నపేట)

చినిగిపోయిన గన్నీ బ్యాగుల్లో పోయడంతో పోతున్న వరి ధాన్యం

కొనుగోళ్లు చేపట్టకపోవడంతో మిట్టపల్లి కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా ధాన్యం రాశులు

ప్రైవేట్‌గా తీసుకొచ్చిన ప్యాడీ క్లీనర్‌తో వడ్లు తూర్పారపడుతున్న రైతులు

బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటలో బసవేశ్వరుడి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 30: కేసీఆర్ బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించి బసవేశ్వరుడి స్ఫూర్తి అంతటా చాటారని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా బుధవారం సిద్దిపేటలో బసవేశ్వరుని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మానవతావాది, సంఘ సంస్కర్త, కుల, మత, వర్గ, వర్ణవ్యవస్థను రూపుమాపడానికి నిర్వరామ కృషి చేసిన దార్శనికుడు బసవేశ్వరుడు అని కొనియాడారు. మహిళా సాధికారత కోసం బడుగు, బలహీన వర్గాల సమానవత్వం కోసం, అస్పృశ్యత నివారణ కోసం, మత ఛాందస వాదులను వ్యతిరేకించిన మహనీయుడు ఆయన అన్నారు. నాటి ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కోకాపేటలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో బసవ భవన్ నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. సమసమాజ స్థాపనకు బాటలు వేసిన బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం మండలంలోని ఎల్లుపల్లిలో జరిగిన పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఎండు గంజాయిని పట్టుకున్న చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, సీసీఎస్ పోలీసులు

భారీగా గంజాయి పట్టివేత

జహీరాబాద్, ఏప్రిల్ 30 : సీసీఎస్, జహీరాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి రూ.20 లక్షల విలువ గల 80 కిలోల గంజాయిని పట్టుకున్నారు. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి, సీసీఎస్ పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి మాడ్గి గ్రామ చౌరస్తాలోని 65 జాతీయ రహదారిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న టాటా ఇండిగో సీఎస్ కారును(ఏపీ28 డీఈ 3257) ఆపి తనిఖీ చేయగా, కారు డీక్కీలో గోధుమ రంగు కవర్ చుట్టిన 40 ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. గంజాయిని తరలిస్తున్న కారు డ్రైవర్ జహీరాబాద్ మండలం గోవిందపూర్‌కు చెందిన తిరుమలేశ్‌ను అదుపులోకి తీసుకొని గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయిని కర్ణాటకలోని బాగ్ధాల్‌లోని వినోద్‌కుమార్‌కు అప్పగించాలని కారుడ్రైవర్ సమీప బంధువైన బీదర్‌కు చెందిన గుండప్ప రూ.50వేల ఇస్తానని ఆశచూపడంతో ఒప్పుకుని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి అరెస్టుతోపాటు కారును సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో గంజాయి సాగు, వినియోగం, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. గంజాయి సాగుచేసినా, తరలించిన 8712656777కు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. గంజాయిని పట్టుకున్న చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, సీసీఎస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పిట్టలగూడెంలో తాగునీటికి తండ్లాట

పిట్టలగూడెంలో ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

- రెండు నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్
- పైపులైన్ మరమ్మతులు చేపట్టడంలో అధికారుల విఫలం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 30: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామ శివారుపల్లె పిట్టలగూడెంలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. తాగునీరు లేక గూడెం వాసులు అల్లాడిపోతున్నారు. పిట్టలగూడెంలో సుమారు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందులో 250 నుంచి 300 జానాభా ఉంది. పిట్టలగూడెంకు తాగునీరు అందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు బోరుబావులు ఉన్నాయి. రెండు నెలల క్రితమే రెండు బోరుబావులు ఎండిపోయాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గుక్కెడు నీళ్లు దొరక్క ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గూడెం ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను చూసి తండాకు చెందిన తుమ్మల అశోక్ తన బోరుబావి నుంచి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కిస్తే పైపులైన్ దెబ్బతిన డంతో ఇండ్లలోకి నీటి సరఫరా కావడం లేదు. మంచి నీళ్లు అందించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదనిగూడెం వాసులు మండిపడుతున్నారు.

నీళ్లు లేక తిప్పలవుతున్నది..

మా పిట్టలగూడెంలో నెల రోజుల నుంచి నీళ్లు లేక మస్తు ఇబ్బంది పడుతున్నం. కనీసం తాగడానికి కూడా ఊళ్లే నీళ్లు దొరుకతలేదు. మొన్న ట్యాంకర్‌తోటి నీళ్లు తెప్పించుకున్నం. నీళ్లు వస్తలేవని ఆఫీసర్లకు చెప్పిన పట్టించుకోవడం లేదు. ఆఫీసర్లు వచ్చి మాకు నీళ్లు వచ్చేటట్లు చూడాలే. లేకపోతే ఖాళీ బిందెలను తీసుకొని ఆఫీసుల దగ్గరికే వస్తాం.

- శాంతమ్మ, పిట్టలగూడెం

రెండు బోర్లు ఎండిపోయినయి

నడి ఎండ కాలంలో తాగునీళ్లు లేక గూడమంతా ఇబ్బందిపడుతున్నది. రెండు బోర్లు ఉంటే అవి మొత్తం ఎండిపోయినయి. నెలరోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు అస్తలేవు. పైపులైన్ పగిలిపోయిన రిపేరు చేసేటోళ్లు లేరు. మా బోరు నుంచైనా నీళ్లు పెడతామని ట్యాంక్‌కు నీళ్లేక్కిస్తే పైపులైన్ సరిగా లేక నీళ్లు ఇండ్లలకు పోతలేవు. నీళ్లకోసం మేము ఇంత ఇబ్బంది పడుతున్న ఏ ఒక్కలు కూడా వచ్చి మమ్మల్ని పట్టించుకోవడం లేదు.

-తుమ్మల అశోక్, పిట్టలగూడెం

కందిలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే

బసవేశ్వరుడి మార్గంలో నడవాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఏప్రిల్ 30: బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బసవేశ్వరుడి 892 జయంతిని పురస్కరించుకొని బుధవారం కందిలోని బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని స్థాపించిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. అన్ని కులాలు మతాల మహిళలకు సమానత్వం కావాలని కోరాడని, కష్టంలోనే సుఖం, స్వర్గం ఉందని చెప్పిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ రాబోయే తరాలకు వారు ఆచరించిన విధానాలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, వీరేశం, మల్లి ఖార్జున్, నాగరాజు పాల్గొన్నారు.

మురుగుతో ముప్పు

చిలిపిచెడ్, ఏప్రిల్ 30: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద మురుగుతో నీటి కలుషితం జరిగే ప్రమాదం ఉంది. వాటర్ ట్యాంకుకు ఇచ్చిన మిషన్ భగీరథ నీటి పైపులైన్‌ను మురుగు ముంచెత్తింది. పైపులైన్ ఏమాత్రం లీకేజీ అయినా మంచి నీరు కలుషితమై గ్రామస్తులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. సమీపంలోనే పల్లె దవాఖాన ఉన్నది. వైద్యులు, సిబ్బంది కూడా దీని గురించి పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మురుగు తొలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిట్కుల్‌లో వాటర్ ట్యాంక్ దగ్గర మురుగులోంచి వేసిన మిషన్ భగీరథ పైపులైన్

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఐకేపీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం, ఏప్రిల్ 30: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఐకేపీ సిబ్బందిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. జిన్నారం మండల కేంద్ర శివారులోని మినీ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. గన్నీసంచుల కొరత, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. మిల్లర్లు లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమశాతాన్ని ప్రతిరోజు పరిశీలించి, సకాలంలో ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కేంద్ర నిర్వాహకులను కలెక్టర్ హెచ్చరించారు. తాలు లేకుండా సరి చూసుకోవాలని, తేదీ, రైతు పేరు, ఫోన్ నెంబర్, ధాన్యం కొనుగోళ్ల పూర్తి వివరాలతో రిజిస్టర్లను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. టార్పాలిన్లు, గన్నీబ్యాగులు, ప్యాడీ క్లీనర్, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులు గడువులోగా డబ్బులు చెల్లించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, తహసీల్దార్ భిక్షపతి, రెవెన్యూ సిబ్బంది, ఐకేపీ ఏపీఎం నరేందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ సిబ్బంది

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాపన్నపేట,ఏప్రిల్ 30 : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఉపాధి హామీ సిబ్బంది ఎంపీడీవో విష్ణువర్ధన్‌కు వినతిపత్రం సమర్పించారు.రాష్ట్ర జేఏసీ ఇచ్చిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఉపాధి ఉద్యోగులు బుధవారం వినతిపత్రాన్ని ఇచ్చారు. ఏపీవో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు రాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి తమకు వేతనాలు రావడం లేదన్నారు. పేస్కేల్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు రాము,ఇన్‌చార్జి ఈసీ యాదగిరి, టెక్నికల్ అసిస్టెంట్లు సుధాకర్, లక్ష్మణ్, బాలరాజు,ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.